సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 1 । ఏప్రిల్ । 2023



డివైడర్‌ను ఢీకొన్న కారు

చెన్నై నుంచి ఒంగోలుకు వెళ్తున్న కారు కావలి వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఇద్దరు మహిళలు మృతి చెందారు.

8లో




బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.61,650
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,507
3 శాతం జీఎస్టీతో	రూ.5,672
నవర (8 గ్రా)	రూ.45,376

గరిష్టం/కనిష్టం
37.2 /25.6

వాతావరణం

శుక్రవారం గాలిలో 68 శాతం తేమ ఉంది. శనివారం వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదయ్యే అవకాశం ముంది.



ఇఫ్తార్ శనివారం (సా) 6.23
సహర్ ఆదివారం (ఉ) 4.46

రంజాన్ వేళలు

4.25 లక్షల ఎకరాలకు సాగునీరు

- నీటి విడుదలకు ఐఏబీలో తీర్మానం
- సమావేశంలో పాల్గొన్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- మైక్రో ఇరిగేషన్‌లో రాష్ట్రం మొదటి స్థానం
- చుక్కల భూముల సమస్య పరిష్కారానికి జీఓ
- సీఎం చేతుల మీదుగా త్వరలో పట్టాల పంపిణీ



మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, చిత్రంలో చైర్‌పర్సన్ అరుణమ్మ, కలెక్టర్ చక్రధర్‌బాబు తదితరులు

నెల్లూరు(పొగతోట): సోమశిల, కండలేరు జలాశయాల నుంచి నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో రెండో పంటకు నీరు విడుదల చేయనున్నారు. మొత్తం 4.25 లక్షల ఎకరాలకు 46 టీఎంసీలు ఇవ్వాలని జిల్లా సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశంలో నిర్ణయించారు. పెన్నా డెల్టా పరిధిలో 1.80 లక్షల ఎకరాలు, కనుపూరు కాలువ 30 వేలు, కావలి కాలువ 30 వేలు, జీకేఎస్ కాలువ 25 వేలు, దక్షిణ కాలువ 20 వేల ఎకరాలు మొత్తం కలిపి 2.85 లక్షల ఎకరాలకు, కండలేరు, ఇతర కాలువల నుంచి 1.40 లక్షల ఎకరాలకు నీరు ఇవ్వనున్నారు. నెల్లూరులోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా సాగునీటి సలహా మండలి, జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశాలు జరిగాయి. ఇందులో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కలెక్టర్ కేవీఎన్ చక్రధర్ బాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు. జలాశయాల్లో నీటి లభ్యత, తాగునీరు, ఇతర అవసరాలు, రెండో పంటకు కేటాయింపులు తదితర అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు.

రైతుల కోసం కార్యక్రమాలు

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతు బాగుంటేనే దేశం అభివృద్ధి చెందుతుందని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నమ్ముతారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అన్నదాతల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. రాజకీయ పార్టీలు, ప్రాంతాలనే భేదం చూడకుండా పారదర్శకంగా పథకాలు అందిస్తున్నామన్నారు. సాగునీరు, వ్యవసాయ సలహా మండలి సమావేశాల్లో ప్రజాప్రతినిధులు, రైతులు తెలిపిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. ఈ–క్రాప్ వందశాతం నమోదు చేసేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

మనదే తొలిస్థానం

మైక్రో ఇరిగేషన్‌లో మన రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో ఉందని కాకాణి తెలిపారు. దేశంలో పది జిల్లాలను ఎంపిక చేస్తే అందులో మూడు మన రాష్ట్రంలో ఉన్నాయని తెలిపారు. చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం సబ్సిడీపై వ్యవసాయ పరికరాలను అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 26 ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా నియోజకవర్గ కేంద్రాల్లో ఈ సెంటర్లు పెట్టేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

సబ్సిడీపై అందించేందుకు..

యంత్ర పరికరాలు, స్ప్రేయర్లు, టార్పాలిన్ పట్టలను రైతులకు సబ్సిడీపై అందించేందుకు చర్యలు తీసుకున్నామని మంత్రి తెలిపారు. సారవంతమైన భూములను గుర్తించడం, ఆ నేలల్లో ఎటువంటి పంటలు వేయాలి?, ఎంతమేరకు దిగుబడి వస్తుందనే అంశాలపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించే చర్యలు తీసుకున్నామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వ్యవసాయ రంగంలో అనేక సంస్కరణలను రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ముఖ్యమంత్రి రైతులకు అన్నివిధాలా అండగా ఉంటూ వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు.

సిరిధాన్యాల సాగుకు ప్రోత్సాహం

కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు మాట్లాడుతూ జిల్లాలో సిరిధాన్యాల సాగును ప్రోత్సహించేందుకు రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. వరి పంటే కాకుండా చిరుధాన్యాలు, పత్తి, వేరుశనగ తదితర పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలన్నారు. రెండో పంటకు పుష్కలంగా నీరందించేందుకు అన్ని చర్యలు చేపట్టామన్నారు. రెండు రిజర్వాయర్లలో నీరు అందుబాటులో ఉందని తెలిపారు. తక్కువ నీటితో అధిక దిగుబడులు వచ్చే పంటలను సాగు చేయాలని సూచించారు.

- అనంతరం కలెక్టర్, వాకాటి నారాయణరెడ్డిని ఘనంగా సన్మానించారు. సమావేశంలో నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, తెలుగుగంగ ప్రాజెక్ట్ ఎస్‌ఈ హరినారాయణరెడ్డి, ఇరిగేషన్ ఎస్‌ఈ కృష్ణమోహన్, సోమశిల ఎస్‌ఈ వెంకటరమణారెడ్డి, వ్యవసాయ శాఖ జేడీ సుధాకర్‌రాజు, ఏడీఈ అనిత, పశుసంవర్ధక శాఖ జేడీలు మహేశ్వరుడు, నాగేశ్వరరావు, జెడ్పీ సీఈఓ చిరంజీవి, నెల్లూరు, కావలి, ఆత్మకూరు ఆర్డీఓలు మలోల, శీనానాయక్, కరుణకుమారి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకునేందుకు..

అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందించేందుకు కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిక పంపుతామని మంత్రి తెలిపారు. పంట నష్టపోయిన రైతులకు అదే సీజన్‌లో పరిహారం జమ చేస్తున్నామన్నారు. రైతులు ఎక్కడికీ వెళ్లకుండా ఎంఎస్‌పీ కన్నా అధిక ధరలకు ధాన్యాన్ని విక్రయిస్తున్నారని తెలిపారు. ఇది శుభ పరిణామన్నారు. ఆర్బీకేలకు రైతులు తీసుకొచ్చిన ధాన్యంలో 17 శాతం తేమ ఉంటే వారికి రశీదు ఇస్తున్నామన్నారు. అది ఎక్కడైనా చెల్లుబాటు అవుతుందన్నారు. ధాన్యం విక్రయించిన రైతులకు మూడు వారాల్లో నగదు అందిస్తామన్నారు.

సీఎం చేతుల మీదుగా..

జిల్లాలో చుక్కల భూముల సమస్యలు అధికంగా ఉన్నాయన్నారు. 43 వేల ఎకరాలకు సంబంధించి సమస్యల పరిష్కారానికి జీఓ జారీ చేశారని గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ నెలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలో పర్యటించనున్నారని, రైతులకు పట్టాలు అందజేస్తామని తెలిపారు. నెల్లూరు, సంగం బ్యారేజీల నిర్మాణాలు పూర్తి కావడంతో భూగర్భ జలాలు అభివృద్ధి చెందాయన్నారు.

పుస్తకావిష్కరణ



రాష్ట్రంలో ఏ జిల్లాలో లేని విధంగా వ్యవసాయం, దాని అనుబంధ శాఖల నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళిక 2023–24 పుస్తకాన్ని మంత్రి, కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్, జేసీ ఆవిష్కరిచారు. ఏ సీజన్‌లో ఏ పంటలు సాగు చేయాలి, సాయిల్, మార్కెటింగ్ తదితర అంశాలకు సంబంధించిన వివరాలను పుస్తకంలో పొందుపరిచారు.

రాళ్లపాడుకు నీరు విడుదల చేయాలి



రాళ్లపాడు ప్రాజెక్టుకు నీరు విడుదల చేసినా చివరి భూములకు అందడం లేదు. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పూర్తిస్థాయిలో నీరు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలి.

– మానుగుంట మహీధర్‌రెడ్డి, కందుకూరు ఎమ్మెల్యే

చెరువులను నింపాలి



గూడూరు సూళ్లూరుపేట డివిజన్ల పరిధిలో 45 చెరువులున్నాయి. వాటిని పూర్తిస్థాయిలో నీరు నింపేలా చర్యలు తీసుకోవాలి. నీటితో నింపడం వల్ల భూగర్భ జలాలు అభివృద్ధి చెంది మంచినీటి సమస్యలు ఉండవని తెలిపారు.

– బల్లి కల్యాణ్ చక్రవర్తి, ఎమ్మెల్సీ

ఆదాయం వచ్చే పంటలు సాగు చేయాలి

మైక్రో ఇరిగేషన్‌కు సంబంధించి రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలి. యంత్రాల కోసం దరఖాస్తు చేసుకోవడం, సబ్సిడీ తదితర అంశాలను వివరించాలి. రైతులకు ఆదాయం వచ్చే పంటలను సాగు చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలి.

– వాకాటి నారాయణరెడ్డి

పండగలా వ్యవసాయం

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వ్యవసాయం పండగలా జరుగుతోంది. అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారు. ఆర్బీకేల్లో రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు ఎమ్మార్పీ ధరలకే అందుతున్నాయి. ధాన్యం అధిక ధరలకు కొనుగోలు చేయడం, సంక్షేమ కార్యక్రమాల వల్ల రాష్ట్రంలో రైతులు సంతోషంగా ఉన్నారు. మెట్టప్రాంతాల్లో సిరిధాన్యాలు అధికంగా సాగు చేసేలా అన్నదాతలకు అవగాహన కల్పించాలి.

– నిరంజన్‌బాబురెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్



సమావేశానికి విచ్చేసిన ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



సమావేశంలో పాల్గొన్న అధికారులు

న్యూస్‌రీల్

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్



నెల్లూరు(అర్బన్): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీహెచ్ మానవేంద్రనాథ్‌రాయ్ నెల్లూరు నగరానికి వచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ చక్రధర్‌బాబు హోటల్ మినర్వా గ్రాండ్‌లో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. న్యాయమూర్తి శనివారం ఉదయం 10 గంటలకు పురమందిరం (టౌన్‌హాలు)లో జరిగే ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ 9వ జిల్లా కాన్ఫరెన్స్‌లో పాల్గొంటారు.

మాతాశిశు మరణాల నివారణకు కృషి

- డీఎంహెచ్‌ఓ పెంచలయ్య



మాట్లాడుతున్న పెంచలయ్య

నెల్లూరు(అర్బన్): జిల్లాలో మాతాశిశు మరణాలను నివారించేందుకు వైద్యాధికారులు కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య సూచించారు. నెల్లూరులోని సంతపేటలో ఉన్న డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో మాతాశిశు మరణాలపై శుక్రవారం మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ఇటీవల రెండు మాతృ, ఐదు శిశు మరణాలు జరిగాయని, ఇది బాధాకరమన్నారు. గర్భంతో ఉన్న వారు పౌష్టికాహారం తీసుకునేలా, సకాలంలో టీకాలు వేయించుకునేలా మెడికల్ ఆఫీసర్లు, వైద్యసిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో డాక్టర్లు వసుంధర, ఇందిర, శాంతిశ్రీ, సింధుజ తదితరులు పాల్గొన్నారు.

9,983 పొగాకు బేళ్ల విక్రయం



డీసీపల్లిలో విక్రయించిన పొగాకు బేళ్లు

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రానికి శుక్రవారం వేలానికి 940 పొగాకు బేళ్లను తీసుకురాగా వాటిలో 910 బేళ్లను కొనుగోలు చేశారని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. మిగిలిన 30 బేళ్లలో 7 నోసేల్, 16 నోబిడ్, 7 సీఆర్‌గా గుర్తించారు. మొత్తంగా 1,21,864 కిలోల పొగాకు అమ్ముడు కాగా రూ.2,37,64,750 వ్యాపారం జరిగింది. ఒక కిలోకు గరిష్టంగా రూ.201, కనిష్టంగా రూ.183, సగటున రూ.195.01 ధర లభించింది.

కలిగిరిలో..

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శుక్రవారం జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 9,778 బేళ్లను అమ్మకానికి తీసుకురాగా 9073 బేళ్లను కొనుగోలు చేశారని 705 బేళ్లను తిరస్కరించారని వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు. కిలో పొగాకుకు గరిష్టంగా రూ.201, కనిష్టంగా రూ.155, సగటున రూ.196.56 ధర లభించింది.

3 నుంచి పింఛన్ల పంపిణీ

నెల్లూరు(పొగతోట): వైఎస్సార్ పెన్షన్ కానుకను ఈనెల 3వ తేదీ నుంచి పంపిణీ చేస్తామని డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1, 2 తేదీల్లో బ్యాంక్‌లకు సెలవు కారణంగా నగదును 3వ తేదీ ఉదయం నుంచి పంపిణీ చేస్తామన్నారు. లబ్ధిదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. 3న తెల్లవారుజాము నుంచి వలంటీర్లు లబ్ధిదారులకు నగదు అందజేస్తారని తెలియజేశారు.

172 కేంద్రాల్లో ‘పది’ పరీక్షలు

- జంబ్లింగ్ విధానంలో నిర్వహణ
- విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం
- మరోవైపు ఓపెన్ స్కూల్ పరీక్షలకు ఏర్పాట్లు



నెల్లూరు: పదో తరగతి విద్యార్థులు

నెల్లూరు(టౌన్): పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయి. జిల్లా వ్యాప్తంగా 172 సెంటర్లను ఏర్పాటు చేశారు. ఏ కేటగిరీలో 91, బీ కేటగిరీలో 56, సీ కేటగిరీలో 25 కేంద్రాలున్నాయి. 14 కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించారు. జంబ్లింగ్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తారు. ఇన్విజిలేటర్లను మూడు రోజులకు ఒకసారి జంబ్లింగ్ పద్ధతిలో నియమించనున్నారు. జిల్లా అబ్జర్వర్‌గా ఆర్జేడీ సుబ్బారావు వ్యవహరించనున్నారు. విద్యార్థులను తనిఖీ చేసిన తర్వాత కేంద్రంలోకి అనుమతించనున్నారు. పరీక్ష సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు.

నిర్వహణ ఇలా..

రెగ్యులర్ విద్యార్థులు 27,291 మంది, ప్రైవేట్ విద్యార్థులు 2,100 మంది హాజరుకానున్నారు. పరీక్షలను ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహిస్తారు. ఉదయం 8.45 గంటలకు విద్యార్థులను అనుమతించనున్నారు. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది రోజు మార్చి రోజు పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఓఎంఆర్ షీట్‌తో కూడిన 24 పేజీల పేపర్లలోనే విద్యార్థులు జవాబులు రాయాలి. ఓఎంఆర్ షీట్‌లోని బార్ కోడింగ్ పాడైనా పేజీలు తక్కువగా ఉన్నా బ్లాంక్ ఆన్సర్ బుక్ ఇస్తారు. ప్రశ్నపత్రాలు లీకేజీని అరికట్టేందుకు ప్రతి దానిపై సీరియల్ నంబర్ వేస్తారు.

పక్కాగా..

పరీక్షలను పక్కాగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. మాస్ కాపీయింగ్‌ను అరికట్టేందుకు కేంద్రాల్లో 172 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, మరో 172 మంది డిపార్ట్‌మెంట్ అధికారులను నియమించారు. ఇంకా 9 ఫ్లయింగ్ స్క్వాడ్, 10 సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. 7 అత్యంత సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ప్రశ్నపత్రాలను సమీపంలోని పోలీసు స్టేషన్లలో భద్రపరిచారు. విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించారు. ఇందుకోసం హాల్‌టికెను చూపించాల్సి ఉంది. కేంద్రాల్లోకి సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువులను విద్యార్థులు తీసుకెళ్లకూడదు. సెంటర్ల వద్ద ఏఎన్‌ఎంతోపాటు మెడికల్ కిట్లు అందుబాటులో ఉంటాయి. విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు తలెత్తితే ప్రాథమిక చికిత్స అందించనున్నారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలకు..

మరోవైపు ఏపీ ఓపెన్ స్కూల్‌కు సంబంధించి పదో తరగతి, ఇంటర్ పరీక్షలను ఏప్రిల్ 3 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా పదో తరగతికి 6 కేంద్రాలు, ఇంటర్‌కు 16 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు జరుగుతాయి. అభ్యాసకులను పరీక్ష సమయానికి గంట ముందుగా కేంద్రంలోకి అనుమతించనున్నారు. రోజు మార్చి రోజు పరీక్షలు జరుగుతాయి. పదికి ఒకటి, ఇంటర్‌కు ఒకటి ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. అదే విధంగా ఇంటర్ అభ్యాసకులకు వచ్చేనెల 18 నుంచి 23వ తేదీ వరకు ప్రాక్టికల్స్ పరీక్షలను నిర్వహించనున్నారు. ఇవి ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయి.

జిల్లాలో..

ఇన్విజిలేటర్లు :	1,800 మంది
చీఫ్ సూపరింటెండెంట్లు :	172 మంది
ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు :	9
సమస్యాత్మక పరీక్ష కేంద్రాలు :	14



పరీక్షలు జరిగే జెడ్పీ హైస్కూల్

ఏర్పాట్లు పూర్తి చేశాం

నెల్లూరు(టౌన్): పదో తరగతి పబ్లిక్, ఓపెన్ స్కూల్ ఎస్‌ఎస్‌సీ, ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఈఓ గంగాభవాని తెలిపారు. నెల్లూరులోని పొదలకూరు రోడ్డులో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్లో శుక్రవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పరీక్షలు జరిగే సమయంలో కేంద్రాల సమీపంలో ఉండే జెరాక్స్ సెంటర్లను మూసివేయిస్తామన్నారు. విద్యార్థులు సివిల్ డ్రస్‌లో రావాలన్నారు. విద్యార్థులకు ఇబ్బందులుంటే 83414 08109 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ గంగాభవాని

సమావేశంలో డిప్యూటీ డీఈఓ భిక్షాలు, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ రామారావు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ కమిటీకి 15 మందే సభ్యులు

- తీర్పు ఇచ్చిన కోర్టు

నెల్లూరు(అర్బన్): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కమిటీలో ఎంసీ మెంబర్లుగా గతంలోలానే 15 మందిని మాత్రమే ఎన్నుకోవాలని హైకోర్టు శుక్రవారం తీర్పునిచ్చింది. ఏప్రిల్ 2వ తేదీన జరిగే ఎన్నికలకు సంబంధించి కలెక్టర్ చక్రధర్‌బాబు 18 మందిని ఎన్నుకునేందుకు అవకాశం కల్పించారు. దీంతో కొంతమంది న్యాయవాదులు హైకోర్టును ఆశ్రయించారు. పరిశీలించిన కోర్టు 15 మందిని మాత్రమే మేనేజింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నుకోవాలని, అంతకు మించి ఎవరికైనా ఓటేస్తే అది చెల్లదని తీర్పులో పేర్కొంది. ఈ విషయమైన కలెక్టర్ చక్రధర్‌బాబు మాట్లాడుతూ రెడ్‌క్రాస్‌కు 15 మంది సభ్యులను మాత్రమే ఎన్నుకోవాలని ఓటర్లయిన జీవితకాల సభ్యులకు సూచించారు. కాగా ఓటర్లు రెడ్‌క్రాస్ జారీ చేసిన జీవితకాల గుర్తింపుకార్డు, అది లేకపోతే ఎన్నికల సంఘం గుర్తించిన ఫొటో గుర్తింపు తీసుకురావాలని సూచించారు.

దంపతుల బలవన్మరణం

- ఆలస్యంగా వెలుగులోకి..
- నెల్లూరులో ఘటన



కృష్ణయ్య, సుజాత (ఫైల్)

నెల్లూరు సిటీ: ఆ దంపతులిద్దరూ కుమార్తెలకు వివాహాలు చేశారు. నెల్లూరులో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కాగా భర్తను మద్యం తాగొద్దని భార్య ఎన్నోసార్లు వారించింది. అయినా అతడిలో మార్పు రాలేదు. దీంతో భార్యాభర్తల మధ్య గొడవలు మొదలయ్యాయి. ఈక్రమంలో ఏమైందో కానీ ఇద్దరూ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. శుక్రవారం పోలీసులు వెల్లడించిన వివరాల మేరకు.. జలదంకి మండలం చామదల గ్రామానికి చెందిన దేవండ్ల కృష్ణయ్య (55), సుజాత (50) దంపతులకు ఇద్దరు కుమార్తెలున్నారు. ఇద్దరికీ వివాహాలు చేశారు. పెద్ద కుమార్తె విజయలక్ష్మి నెల్లూరులోని ఎన్‌సీసీ కాలనీలో, చిన్న కుమార్తె నందిని తెలంగాణ రాష్ట్రంలో నివాసం ఉంటున్నారు. కాగా దంపతులు గ్రామంలోని పొలాన్ని కౌలుకు ఇచ్చారు. విజయలక్ష్మి ఇంటికి సమీపంలో నివాసం ఉంటున్నారు. కృష్ణయ్య బేల్దారి మేస్త్రీగా పనిచేస్తున్నాడు. సుజాత కూడా భర్తతో కలిసి పనులకు వెళ్తుండేది. కాగా కృష్ణయ్య నిత్యం మద్యం తాగేవాడు. దీంతో సుజాత మద్యం తాగొద్దని భర్తకు పలుమార్లు చెప్పింది. డబ్బు మద్యానికి ఖర్చు చేస్తే ఎలా? అని ప్రశ్నించేది. అయితే కృష్ణయ్య మద్యానికి పూర్తిగా బానిస కావడంతో తరచూ గొడవలు జరిగేవి.

పండగరోజు అనంతలోకాలకు..

గురువారం కృష్ణయ్య, సుజాత ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఇటీవల నందిని తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. కృష్ణయ్య గురువారం పూటుగా మద్యం తాగి భోజనం చేసి నిద్రపోయాడు. దీంతో నందిని సోదరి విజయలక్ష్మి వద్దకు వెళ్లింది. ఇంట్లో కృష్ణయ్య, సుజాత మాత్రమే ఉన్నారు. సాయంత్రం 5.30 గంటలకు నందిని తండ్రి ఇంటికి తిరిగి వచ్చింది. తలుపులు తెరిచి ఉన్నాయి. వెంటనే లోపలికి వెళ్లి చూడగా ఇద్దరూ చీరతో ఉరేసుకుని కింద పడి ఉన్నారు. నందిని భయంతో సోదరి వద్దకు పరుగులు తీసింది. తర్వాత ఈ విషయాన్ని బంధువులకు తెలియజేశారు. రాత్రి వేదాయపాళెం పోలీసులకు సమాచారం అందింది. డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, వేదాయపాళెం సీఐ నారాయణ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. శుక్రవారం పోస్టుమార్టం పూర్తయ్యాక మృతదేహాలను కుటుంబసభ్యులకు అందజేశారు. చామదల గ్రామంలో దంపతుల అంత్యక్రియలు చేశారు.

వారి మధ్య ఏమి జరిగింది?

గురువారం మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల మధ్యలో దంపతుల మధ్య ఏ విషయమై గొడవ జరిగిందో తెలియాల్సి ఉంది. ఇద్దరూ చీరతో ఉరేసుకుని కిందపడి ఉన్నారు. భార్య తలకు గాయమై ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి అన్నీ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

పొగాకు రైతుల ఆందోళన



వేలం కేంద్రంలో చర్చలు జరుపుతున్న రైతులు, నాయకులు

కలిగిరి: ఆరుగాలం కష్టపడి పండించిన పొగాకుకు గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరుతూ పొగాకు రైతులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. నాణ్యమైన పొగాకుకు మంచి ధరలు లభించడం లేదని పొగాకు వేలాన్ని నిలిపివేశారు. దీంతో వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ రైతులు, పొగాకు కొనుగోలు కంపెనీల ప్రతినిధులతో చర్చలు జరిపారు. నాణ్యమైన గ్రేడు పొగాకును మంచి ధరలకు అన్ని కంపెనీలు కొనుగోలు చేయాలని సూచించారు. రైతులకు గిట్టుబాటు ధరలు లభించేలా సహకరిస్తామని హామీ ఇవ్వడంతో తిరిగి వేలాన్ని కొనసాగించారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

కావలి రూరల్: రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కావలి రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు..కావలి రైల్వేస్టేషన్ సమీపంలో ఉదయగిరి బ్రిడ్జి వద్ద సుమారు 40 నుంచి 45 ఏళ్లు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి కేరళ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు బులుగు రంగు చొక్కా, బులుగు, సిమెంట్ రంగు గళ్ల లుంగీ ధరించి ఉన్నాడు. మృతుడి చేతిపై ఆంజనేయస్వామి పచ్చబొట్టు ఉంది. మృతదేహాన్ని రైల్వే పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్సై తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

ఇరువర్గాల ఘర్షణ

పొదలకూరు : పొలం వివాదం నేపథ్యంలో ఇరువర్గాలు ఘర్షణ పడిన ఘటన చెన్నారెడ్డిపాళెంలో చోటు చేసుకుంది. వివరాలు..చెన్నారెడ్డిపల్లికి చెందిన ఆనంద్‌రెడ్డి, సుబ్బారెడ్డి నడుమ పొలం వ్యవహారంలో వివాదం చోటుచేసుకుని గురువారం రాత్రి ఘర్షణకు దారి తీసింది. ఇరువర్గాల వారు పరస్పరం ఇళ్లపై దాడులు చేసుకుని కార్లను ధ్వంసం చేసుకున్నారు. శుక్రవారం ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు ఒక వర్గానికి చెందిన ఐదుగురు, మరో వర్గానికి చెందిన ఐదుగురితో పాటు మరికొందరిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్‌కే కరిముల్లా తెలిపారు.

విభిన్న ప్రతిభావంతుల పోస్టుల భర్తీకి చర్యలు

నెల్లూరు (వేదాయపాళెం): జిల్లాలో 2022–23 సంవత్సరానికి సంబంధించి విభిన్న ప్రతిభావంతులు (దివ్యాంగుల) కోసం గ్రూప్–4 సర్వీసులో కేటాయించబడి భర్తీ కాకుండా మిగిలిపోయిన పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు వీ నాగరాజకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రేడ్–3కు చెందిన టైపిస్టు–1, లైబ్రేరియన్–2, 4వ తరగతికి చెందిన కామాటి –3, పీహెచ్ వర్కర్–2, కుక్–1, ఫిట్టర్ కూలీ–1 పోస్టుల ఖాళీలకు విడివిడిగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు వనంతోపులోని కార్యాలయంలో నేరుగా లేదా 0861–2329581 నంబరులో సంప్రదించాలని కోరారు.

బిగ్‌బాస్ ఫేం ఆదిరెడ్డికి ఐపీఎల్ ప్రత్యేక ఆహ్వానం



కోల్‌కతా నైట్‌రైడర్స్ క్రీడాకారులతో బిగ్‌బాస్ ఫేం ఆదిరెడ్డి

వరికుంటపాడు: వచ్చే నెల 6న కోల్‌కత్తా నైటరైడర్స్, రాయల్‌చాలెంజర్స్ బెంగళూరు మధ్యన జరగనున్న ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌కు వరికుంటపాడుకు చెందిన బిగ్‌బాస్ ఫేం ఆదిరెడ్డిని కోల్‌కతా జట్టు ప్రిన్సిపల్ పార్టనర్ మైఫాబ్ 11 ప్రత్యేకంగా ఆహ్వానించింది. శుక్రవారం కోల్‌కతాలో ఆదిరెడ్డిని కోల్‌కతా నైటరైడర్స్ క్రికెట్ జట్టు సభ్యులు అభినందించారు. అనంతరం ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌ను వీక్షించేందుకు ఆదిరెడ్డి ఫ్యామిలీకి వీఐపీ టికెట్లను ఉచితంగా అందజేశారు.

మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

- కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు



నార్కోటిక్స్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

నెల్లూరు సిటీ: మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు పిలుపునిచ్చారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి నార్కోటిక్స్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. మాదకద్రవ్యాల విక్రయాలపై నిఘా ఉంచాలన్నారు. ప్రణాళికాబద్ధంగా దాడులు చేసి అక్రమరవాణా, విక్రయాలను అడ్డుకోవాలని సూచించారు. స్వచ్ఛంద సంస్థల సహకారంలో మాదకద్రవ్య రహిత సమాజానికి కృషి చేయాలన్నారు. ఎస్పీ విజయారావు మాట్లాడుతూ జిల్లాలో మాదకద్రవ్యాలు, గంజాయి విక్రయాల నిర్మూలనకు చర్యలు చేపట్టామని తెలిపారు. దాడులు చేసి కేసులు నమోదు చేశామన్నారు. నిత్యం నేరాలకు పాల్పడే వారిపై పీడీయాక్ట్ కింద కేసులు నమోదు చేశామని తెలిపారు. యువతను చైతన్యవంతం చేసేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఎక్కడైనా గంజాయి, మాదకద్రవ్యాల విక్రయాలు, నిల్వలను గుర్తిస్తే సెబ్ టోల్ ఫ్రీనంబర్ 14500కు సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ డీ హిమావతి, అటవీశాఖ అధికారి, సబ్‌కలెక్టర్లు, ఆర్డీఓలు, డీఎంఅండ్‌హెచ్‌ఓ, డీఈఓ, జేడీ అగ్రికల్చర్, కమర్షియల్ ట్యాక్స్ అధికారులు, ఏస్ఈబీ, సబ్‌డివిజన్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల జెరాక్స్ కోసం వెళ్తుండగా..

- మోటార్‌సైకిల్‌పైకి దూసుకెళ్లిన టిప్పర్
- యువకుడి దుర్మరణం



హరికృష్ణ (ఫైల్)

కావలి రూరల్: ఉద్యోగ ప్రయత్నాల్లో భాగంగా సర్టిఫికెట్లు జెరాక్స్ తీయించుకొనేందుకు మోటార్‌సైకిల్‌పై వెళ్తూ ట్రాఫిక్‌లో నిలిచిన యువకుడిపైకి టిప్పర్ అదుపుతప్పి దూసుకెళ్లడంతో దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన పట్టణంలోని ఉదయగిరి బ్రిడ్జి సెంటర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు..పట్టణంలోని వెంగళరావునగర్‌కు చెందిన వేములపాటి నారాయణ, పెంచలమ్మ దంపతులు. వారికి కుమారుడు హరికృష్ణ(25), కుమార్తె సంతానం. హరికృష్ణ డిగ్రీ పూర్తి చేసి గత కొంతకాలంగా శ్రీకాళహస్తిలోని గురురాఘవేంద్ర కంపెనీలో పనిచేస్తూ మానేసి ఇంటికి వచ్చాడు. హైదరాబాద్‌లో మరో ఉద్యోగం కోసం యత్నిస్తూ సర్టిఫికెట్లు జెరాక్స్‌లు తీసుకొనేందుకు శుక్రవారం మోటార్‌సైకిల్‌పై ట్రంకురోడ్డుకు బయలుదేరాడు. ఉదయగిరి బ్రిడ్జి కూడలి వద్ద ట్రాఫిక్ ఉండడంతో ఆగాడు. అదే సమయంలో జలదంకి మండలం అన్నవరం క్వారీ నుంచి కంకర లోడుతో గురురాఘవేంద్ర కంపెనీకి చెందిన టిప్పర్ పట్టణంలోకి వస్తోంది. ఉదయగిరి బ్రిడ్జి కూడలి వద్ద ట్రాఫిక్ ఉండడంతో టిప్పర్‌ను నిలిపేందుకు డ్రైవర్ బ్రేకులు వేసి ఎంత ప్రయత్నించినా అధిక లోడు కారణంగా ఆగలేదు. ముందున్న హరికృష్ణ మోటార్‌సైకిల్‌పైకి దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఒకటో పట్టణ ఎస్సై గోపికృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చంద్రబాబు రాజకీయ వ్యభిచారి

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



ఎమ్మెల్యే ప్రసన్న

కోవూరు (విడవలూరు): చంద్రబాబు రాజకీయ వ్యభిచారని, ఏ గాలికి ఆ చాప వేయడం ఆయన నైజమని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. విడవలూరు మండలం ఊటుకూరులో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబుకు ఒంటరిగా పోటీ చేసిన చరిత్ర లేదని, ఏదోక పార్టీతో పొత్తు పెట్టుకునే ఎన్నికలకు వెళ్తారన్నారు. ఎల్లో మీడియా ఊహాజనిత కథనాలతో బాబు భజనను కొనసాగిస్తున్నాయన్నారు. ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు గోతి కాడ నక్కలా ఎదురుచూడటం బాబు నైజం అన్నారు. ఎన్నికల్లో డబ్బుల పంపిణీకి శ్రీకారం చుట్టిందే ఆయనేనన్నారు. పవన్ కళ్యాణ్ అప్పుడప్పుడు అత్తగారింటికి వచ్చినట్లుగా ఏపీకి వచ్చి చంద్రబాబు స్క్రిప్టులను చదువుతుంటారన్నారు. సీఎం వైఎస్ జగన్ మీద లేనిపోని విమర్శలు చేసి మళ్లీ హైదరాబాద్ వెళ్లిపోతుంటారన్నారు. టీడీపీ హయాంలోనే పార్లపల్లి సొసైటీలో రూ.3కోట్ల కుంభకోణం జరిగిందన్నారు. దాన్ని ఎల్లోమీడియా వక్రీకరిస్తూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జరిగిందని రాయడం సిగ్గుచేటు అన్నారు. గతంలోనే కుంభకోణంపై విచారణ చేయమని అధికారులకు చెప్పడం జరిగిందన్నారు. ప్రస్తుతం విచారణ జరుగుతోందన్నారు. కలెక్టర్‌ను సైతం కలిసి విచారణను వేగవంతం చేసి దోషులను శిక్షించాలని కోరుతామన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు, పార్టీ మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్లు పూండ్ల అచ్యుత్‌రెడ్డి, రామిరెడ్డి భానురెడ్డి, పాల్గొన్నారు.


నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 118
లేయర్ (లైవ్)	: 75
బ్రాయిలర్ చికెన్	: 210
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 230
లేయర్ చికెన్	: 128

నిమ్మధరలు

పొదలకూరు (కిలో)

పెద్దవి	: రూ. 70
సన్నవి	: రూ. 50
పండ్లు	: రూ. 25



ప్రభుత్వ పనితీరు తెలుసుకోవడం పౌరుల హక్కు

- రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ హరిప్రసాద్‌రెడ్డి



మాట్లాడుతున్న కమిషనర్ హరిప్రసాద్‌రెడ్డి

పొదలకూరు : ప్రజాస్వామ్యదేశంలో ప్రభుత్వాలు ఎలా పనిచేస్తున్నాయో తెలుసుకోవడం ప్రతి పౌరుడి హక్కు అని రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ ఉల్చాల హరిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన సైదాపురం మండలంలో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళుతూ పొదలకూరు ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో విలేకరులతో మాట్లాడారు. పౌరులు పన్నులు చెల్లిస్తున్నందున ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను తెలుసుకునే హక్కు వారికి ఉంటుందన్నారు. పౌరులు ఆర్టీఐ ద్వారా ప్రభుత్వ శాఖల సమాచారాన్ని కోరితే అధికారులు తప్పకుండా ఇవ్వాలన్నారు. సమాచార హక్కు చట్టంపై అధికారులు స్పందించకపోతే క్రమశిక్షణా చర్యలు తీసుకునేందుకు సంబంధిత ప్రభుత్వ శాఖలకు ఆదేశాలు పంపుతామన్నారు. ఎవరైనా సమాచార హక్కు చట్టాన్ని దుర్వినియోగం చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు సంబంధిత అధికారులు ఆధారాలు చూపితే తాము పోలీసుల ద్వారా అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. సమాచార హక్కు చట్టం అమల్లో రాష్ట్రం ప్రథమస్థానంలో ఉందన్నారు. త్వరితగతిన విజ్ఞప్తులను పరిష్కరిస్తున్న రాష్ట్రాల్లో ఏపీ ఐదో స్థానంలో ఉందన్నారు. రాష్ట్రంలో మూడు వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. మేలో నెల్లూరులో సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆయన వెంట తహసీల్దార్ ప్రసాద్, సీఐ జీ సంగమేశ్వరరావు, ఎస్సై కరిముల్లా, వీఆర్వో శ్రీహరి ఉన్నారు.

అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న కారు

- ఇద్దరి మృతి, మరో ఇద్దరికి స్వల్ప గాయాలు



ప్రియాంక, భారతి మృతదేహాలు

కావలి రూరల్: చెన్నై నుంచి ఒంగోలుకు వెళ్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో బొర్రా ప్రియాంక (30), భారతి (50) మృతిచెందగా మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. ఈ ఘటన కావలి వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై ఎం వెంకటరావు తెలిపిన వివరాల మేరకు..బొర్ర ప్రవీణ్ చెన్నైలోని మాండో ఆటోమోటీవ్ గ్రూపులో ఉద్యోగం చేస్తూ అక్కడే ఉంటున్నారు. కుమారుడి స్కూల్‌కు సెలవులు ఇవ్వడంతో స్వగ్రామమైన ఒంగోలులోని నిర్మల్‌నగర్‌కు భార్య ప్రియాంక, అత్త భారతి, కుమారుడు నందతో కలిసి కారులో చెన్నై నుంచి ఒంగోలుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో కావలి ఆర్‌కే డాబా వద్ద కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో భార్య ప్రియాంక, అత్త భారతి అక్కడికక్కడే మృతి చెందారు. ప్రవీణ్, కుమారుడు స్వల్పంగా గాయపడ్డారు. మృతదేహాలను పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి రేషన్ సరుకుల పంపిణీ

నెల్లూరు(అర్బన్): జిల్లాలో ఉన్న 7,22,257 బియ్యం కార్డుదారులకు 438 మొబైల్ వాహనాల ద్వారా శనివారం నుంచి ఈనెల 17వ తేదీ వరకు రేషన్ సరుకులను ఇంటి వద్దనే అందజేయనున్నట్లు డీఎస్‌ఓ టి.వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 8 గంటల వరకు పంపిణీ జరుగుతుందన్నారు. ఒక్కో కుటుంబసభ్యుడికి ఉచితంగా ఐదు కేజీల ఫోర్టిఫైడ్ బియ్యంతో పాటు కందిపప్పు కిలో రూ.67, అరకిలో చక్కెర రూ.17కు అందిస్తామన్నారు. అంత్యోదయ, అన్నయోజన కార్డుదారులకు 35 కిలోల ఫోర్టిఫైడ్ బియ్యం ఉచితంగా ఇస్తామన్నారు. వీరికి కందిపప్పు కిలో రూ.67తోపాటు కిలో చక్కెర రూ.13.50కు అందిస్తామన్నారు. ఫోర్టిఫైడ్ బియ్యంపై ప్రజలకు సరైన అవగాహన లేకపోవడంతో ప్లాస్టిక్ రైస్‌గా అపోహ పడుతున్నారన్నారు. ఈ బియ్యం విషయంలో ఎలాంటి సందేహాలు వద్దన్నారు.

మెరిట్ జాబితా విడుదల

నెల్లూరు(అర్బన్): జిల్లా క్షయ (టీబీ) నివారణా విభాగంలో ఖాళీగా ఉన్న వివిధ పోస్టుల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సంబంధించి ప్రొవిజనల్ మెరిట్ జాబితాను విడుదల చేశామని జిల్లా క్షయ నివారణ అధికారి, అడిషనల్ డీఎంహెచ్‌ఓ వెంకటప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బ్యాక్‌లాగ్‌తో పాటు, ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు సంబంధించిన మెరిట్ జాబితాను విడుదల చేశామని వివరించారు. హెచ్‌టీటీపీఎస్://ఎస్పీఎస్‌నెల్లూరు.ఏపీ.జీఓవీ.ఇన్/నోటీస్–కేటగిరి/రిక్రూట్‌మెంట్ వెబ్‌సైట్‌లో మెరిట్ జాబితాను అందుబాటులో ఉంచామని తెలిపారు. అభ్యర్థులు పరిశీలించుకుని అభ్యంతరాలుంటే ఈనెల 2వ తేదీలోగా సంతపేటలోని జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలోని టీబీ, లెప్రసీ, ఎయిడ్స్ కార్యాలయంలో తెలియజేయాలని కోరారు.

ఆటోను ఢీకొన్న కారు

- వృద్ధుడి మృతి, ఆటో డ్రైవర్‌కు గాయాలు



ఘటనా స్థలంలో సదాశివరెడ్డి మృతదేహం



క్షతగాత్రుడు వీరయ్యను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

బుచ్చిరెడ్డిపాళెం: ఆటోను కారు ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న వృద్ధుడు మృతి చెందగా, ఆటో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మండలంలోని సాల్మన్‌పురం వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీస్‌ల వివరాల మేరకు.. మినగల్లుకు చెందిన గణపతి సదాశివరెడ్డి(67) వ్యక్తిగత పనుల నిమిత్తం బుచ్చిరెడ్డిపాళేనికి ఆటోలో వస్తున్నాడు. ఆటో సాల్మన్‌పురం మలుపు వద్దకొచ్చే సరికి బుచ్చిరెడ్డిపాళెం నుంచి నెల్లూరు వైపు వెళుతున్న కారు అతి వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో హైవే పక్కనున్న ఖాళీ స్థలంలో బోల్తా పడగా, అందులో ప్రయాణిస్తున్న సదాశివరెడ్డి, ఆటో డ్రైవర్ వీరయ్య ఎగిరి పడ్డారు. సదాశివరెడ్డి తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటో డ్రైవర్ వీరయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. కారు డ్రైవర్ పరారయ్యాడు. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే 108 వాహనానికి సమాచారం అందించడంతో గాయపడిన వీరయ్యను బుచ్చిరెడ్డిపాళెం వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో నెల్లూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి సదాశివరెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.

ప్రేమ విఫలమైందని యువకుడి ఆత్మహత్య



శశికుమార్ మృతదేహం

నెల్లూరు సిటీ: తన ప్రేమ విఫలమైందని, తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని స్నేహితులకు ఫోన్‌లో చెబుతూనే ఓ యువకుడు రైలు కిందపడి తనువు చాలించిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల మేరకు.. నగరంలోని మహిళా ప్రాంగణం సమీపంలోని వీఎంఆర్‌నగర్ రెండో వీధిలో నివాసం ఉంటున్న అలగప్పన్(లేట్), రమణమ్మకు ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. చిన్నకుమారుడు ముత్యాల శశికుమార్(30) బేల్దారి పనులు చేస్తున్నాడు. గురువారం రాత్రి శశికుమార్ డీమార్ట్ వద్ద రైలు పట్టాలపైకి వెళ్లాడు. స్నేహితులకు ఫోన్‌చేసి తాను ఓ అమ్మాయిని ప్రేమించానని, తన ప్రేమ విఫలమైందని తన బాధను పంచుకున్నాడు. ఫోన్‌లో మాట్లాడుతూనే గూడూరు నుంచి నెల్లూరువైపు వస్తున్న రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారంతో రైల్వేపోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు.